

# నవభూమి

## కరీంనగర్

అనుబంధం

06 మే,2025 మంగళవారం పేజీలు:5

www.epaper.navabhoomi.in


### కులగణన చేపట్టి చిత్తశుద్ధి

# నిరూపించుకోవాలి




**సిరిసిల్ల -నవభూమి:** కేంద్రంలోని బీజే పీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్య క్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండల మార్కెట్ యార్డు లు, ఐకేపీ కేంద్రాల ద్వారా ధాన్యం కొనగోళ్లను ప్రారంభిం చామని, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ధాన్యం కొనుగోళ్ళు చూసి బీజేపీ నాయకులు చూసి మాట్లాడాలని అన్నారు. కొనుగోళ్లు చేసి ధాన్యంకు రైతుల ఖాతాల్లో కూడా డబ్బు లు వేస్తున్నారన్నారు. అపారెల్ పార్కుతో పాటు అన్ని మండలాల్లో ధాన్యంతో గోదాములు నిండిపోతున్నాయని అన్నారు. రైస్ మిల్లకు కూడా ధాన్యం తరలించడం కూడా జరుగుతుందన్నారు. నిన్నటివరకు దాదాపు 75480 మెట్రి క్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చెప్పారని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీని వాస్,నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ధాన్యం కొనగోళ్ళపై ఆరా తీస్తూ కలెక్టర్‌ను సంప్రదిస్తున్నారని అ న్నారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డికి భయపడి కులగణన చేపడుతామని కేంద్ర క్యాబినేట్ ప్రకటించిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టి అసెంబ్లీలో బిల్లును ఆమోదించి గవర్నర్‌కు పంపిస్తే గవర్నర్‌కు ఆ మోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నా రు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షు డు ఆకునూరి బాలరాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యడు వంగ మల్లేశంగౌడ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెం కటేశం, నక్క నర్సయ్య, మాజీ కౌన్సిలర్ ఆడెపు చంద్రకళ, వెంగళ లక్ష్మినర్సయ్య, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరె క్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు గడ్డం కిరణ్, అన్నల్ దాస్ భాను, బొద్దుల శ్రీనివాస్, ఎక్కల్‌దేది అంజనేయులు, ఎండీ అఫాన్, గౌతమ్, నారాయణ, యాదగిరి, చందన పాల్గొన్నారు.

### మెరుగైన వైద్యం అందించడమే

# ప్రభుత్వ ధ్యేయం: ప్రభుత్వ విప్ ఆది

**వేములవాడ -నవభూమి:** ప్రజలకు మెరుగైన కనీస సౌకర్యాలు, వైసద్యం అందించడమే ప్రభు త్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామంలో రూ. 1.43 కోట్లతో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి ఆదివారం కలెక్టర్ సందీప్‌కుమార్‌తో కలిసి ఆయన శుంకుస్థాపన చేసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శాత్రాజు పల్లి గ్రామం చైతన్యవంతమైందని అన్నారు. ఎంతో మం ది ప్రభుత్వ ఉద్యోగులను అందించిన చరిత్ర గ్రామానికి ఉందని గుర్తు చేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి చేసుకుంటుపోతున్నామని స్పష్టం చేశా రు. గ్రామంలో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తే చుట్టపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, ఈ ప్రాంతం వైద్యానికి హబ్‌గా ఏర్పడుతుందని అన్నారు. ఎవరు అడగకున్నా ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని వెల్లడించారు. సైడ్‌డ్రైన్ నిర్మాణానికి రూ. 12 లక్షల నిధులు మంజూరు చేశామని తెలిపారు. అనంతరం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మా ట్లాడుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవతో హెల్త్ సెంటర్ ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపా రు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, సింగిల్విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సంఘ స్వామి, సంద్రగిరి శ్రీనివాస్ తదిత రులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



### సుస్థిర సాగు విధానానికి

# శ్రీకారం..

**సిరిసిల్ల-నవభూమి:**రైతులను నష్టాల నుంచి గట్టేక్కించేలా సుస్థిర వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచడంతో పాటు శాస్త్రీయత వైపు చైతన్యవంతం చేసే దిశగా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 13వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 46 గ్రామాల్లో రైతుల వద్దకే శాస్త్రవేత్తలు వెళ్లి పంటల సాగుపై సలహాలు, సూచనలు అందించనున్నారు. శాస్త్రవేత్తలతో పాటు వ్యవసాయ అధికారులు, ఏఈవోలు, ఎంఈవోలు, రైతుల వద్దకు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. తక్కువ పెట్టుబడితో దిగుబడులు ఎక్కువగా సాధించే పద్ధతులపై శాస్త్రీయ సూచనలు అందిస్తారు. ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న వాతావరణ పరిస్థితులు, నీటి కొరత, భూమిలోని సారం తగ్గడం వంటి ప్రధాన సమస్యలకు పరిష్కార మార్గాలు చూపనున్నారు.వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి..జిల్లాలో వానాకాలం సీజన్‌లో వేసే వరి, పత్తి, ఇతర పంటలతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలపై కూడా దృష్టి సారించనున్నారు. ఉద్యానవన పంటలు, కూరగాయల సాగుపై అవగాహన కల్పిస్తారు. జిల్లాలో వానాకాలం సీజన్‌లో 2.40 లక్షల ఎకరాల వరకు వివిధ పంటలు సాగు చేయనున్నారు. వరి 1.80 లక్షల ఎకరాల వరకు వరి, 50 వేల ఎకరాల వరకు పత్తి ప్రధానంగా సాగు చేయనున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుతారు. సాంకేతికత ఆధారంగా రైతుల అభివృద్ధికి రైతుల ముంగిట శాస్త్రవేత్తల కార్యక్రమం దోహదపడుతుందని భావిస్తున్నారు. గ్రామాల్లో నాణ్యమైన విత్తనాల తయారీకి ప్రణాళికలు సిద్ధం చేశారు. వీరికి శాస్త్రీయంగా శిక్షణ కూడా అందించనున్నారు. విత్తన ఎంపికలపై అవగాహన కల్పించనున్నారు.జిల్లాలో 46 గ్రామాల్లోకి శాస్త్రవేత్తలు..రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నేపథ్యంలో ఈనెల 5 నుంచి జూన్ 13వ తేది వరకు జిల్లాలో రైతు వేదికలు, గ్రామపంచాయతీల వద్ద రైతులతో సమావేశాలను నిర్వహిస్తారు. అవగాహన కార్యక్రమాలు చేపడుతారు. జిల్లాలో 260 గ్రామ పంచాయతీలు ఉండగా, 46 గ్రామాలను ఎంపిక చేశారు. అందులో వేములవాడ రూరల్ మండలంలో వట్టెంల, హన్మాజిపేట, చెక్కపల్లి, మర్రిపల్లి, బోయినపల్లి మండలంలో బోయినపల్లి, విలాసాగర్, మాన్వాడ, తడగొండ, ఇల్లంతకుంట మండలంలో పొత్తూర్, గాలిపల్లి, రేపాక, పెద్దలింగాపూర్, ముస్కానిపేట, వల్లంపట్ల, రుద్రంగి మండలంలో రుద్రంగి, సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో చంద్రంపేట, చిన్నబోనాల, చందుర్తి మండలంలో మర్రిగడ్డ, సనుగుల చందుర్తి, మూడపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలో వెంకటాపూర్, బొప్పాపూర్, గొల్లపల్లె, కోనరావుపేట మండలం నిజామాబాద్, కోనరావుపేట, మామిడిపల్లి, సుద్దాల, గంభీరావుపేట మండలంలో మల్లారెడ్డిపేట, లింగన్నపేట, గంభీరావుపేట, నర్మాల, గోరంటాల, తంగళ్లపల్లి మండలంలో తంగళ్లపల్లి, తాడూర్, కస్బెకట్కూర్, దేశాయిపల్లి, బద్దెనపల్లి, జిల్లెల్ల, ముస్తాబాద్ మండలంలో చీకోడు, ముస్తాబాద్, ఆవునూర్, మద్దికుంట, మొర్రాయిపల్లె, వీర్నపల్లి మండలంలో వీర్నపల్లి, వేములవాడ మండలంలో మారుపాక గ్రామాల్లో శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సుస్థిర ఆదాయాన్ని పొందేలా, పర్యావరణం కాపాడే దిశగా అవగాహన కల్పించనున్నారు.



## భూ ప్రకంపనలు.. పరుగులు తీసిన ప్రజలు



**కరీంనగర్, -నవభూమి:** ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా భూప్రకంపనలు సంభవించాయి. జగిత్యాల, వేములవాడ, కరీంనగర్ ప్రాంతాల్లో ఒక్కసారిగా భూమి కంపించింది. ధర్మపురి, సిరిసిల్ల, సుల్తానాబాద్?లోనూ ప్రకంపనలు వచ్చాయి. రిక్టర్ స్కేలుపై 3.5గా భూకంప తీవ్రత నమోదైంది. దాదాపు ఐదు సెకన్లపాటు భూమి కంపించడంతో ప్రజలు తీవ్రభయాందోళనకు గురయ్యారు. ఇళ్లలోని సామగ్రి సైతం కదిలిపోవడంతో ఏ జరుగుతుందో అర్థంకాక భయంతో బయటకు పరుగులు తీశారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు నెలల వ్యవధిలో ఇలా భూమి కంపించడం రెండోసారి కావడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మరి ముఖ్యంగా చొప్పదండి, గంగాధర, రామడుగు మండలాల్లో కొన్ని సెకన్ల పాటు ప్రకంపనలు వచ్చాయి. అలాగే నిర్మల్ జిల్లాలోనూ పలు చోట్ల భూప్రకంపనలు చోటుచేసుకున్నట్లు సమాచారం.మరోవైపు పాకిస్థాన్‌లో సైతం భూకంపం సంభవించింది. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా రికార్డయింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు భూమి ప్రకంపించినట్లు జాతీయ భూకంపం సంస్థ వెల్లడించింది. ఖైబర్ ఫక్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో ఛిత్రాల్ జిల్లాలో ఈ భూకంపం సంభవించిందని స్థానిక మీడియా వెల్లడించింది. భూ ఉపరితలం నుంచి 10 కిలోమీటర్ల దిగువన ఈ భూమిలో కదలికలు చోటు చేసుకున్నాయని తెలిపింది. ఆఫ్ఘనిస్తాన్, తజకిస్తాన్ సరిహద్దుల్లో ఛిత్రాల్ జిల్లా ఉంటుంది. ఈ భూప్రకంపనలు రెండు దేశాల్లో నమోదయ్యాయి. భూకంపం సంభవించిన వెంటనే స్థానికులు తీవ్ర భయాందోళనలతో ఇళ్లల్లో నుంచి బయటికి పరుగులు తీశారు.

## పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



**ఎల్లారెడ్డిపేట, -నవభూమి:** పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆకాంక్షించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని ఒగ్గు శ్రీనిధికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సమకూర్చిన ట్యాబ్‌ను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం అందజేశారు. ట్యాబ్‌ను సద్వినియోగం చేసుకుని నీట్‌లో మంచి ర్యాంక్ సాధించాలని సూచించారు. ఆయన వెంట భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఘనంగా భగీరథ జయంతి

**పెద్దపల్లి -నవభూమి:** జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాడూరి శ్రీమన్నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా భగీరథ జయంతిని జరపడం హర్షనీయమన్నారు. గంగను భువినుండి దివికి తీసుకువచ్చిన భగీరథ మహర్షి చరిత్ర ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భగీరథ సామాజిక వర్గానికి చెందిన ఉప్పరిసాగర కులస్తులు బీసీల ఐక్యతకు భగీరథ ప్రయత్నం జరపాలని పిలుపునిచ్చారు. ఆయా మహనీయుల ఉత్సవాలను కుల ఉత్సవాలుగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్దార్‌పాపన్న, చాకలి ఐలమ్మ, కొండ లక్ష్మణ్ బాపూజీలు కులా లు, మతాలక తీతంగా సమాజ అభివృద్ధికి పోరా డారని తెలిపారు. వీరిని ఒక కులానికి, వర్గానికి పరిమితం చేయడం సరికాదన్నారు. నాగరికత పుట్టినప్పటి నుంచి సాగర ఉప్పరుల చరిత్ర నిర్మాణమైందన్నారు. నాయకులు లక్ష్మణ్, వెంకటేశం, శ్రీనివాస్, సాగర్ జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పరిష్కారం దిశగా అడుగులు

**జగిత్యాల, -నవభూమి:** భూ సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో నూతన విధి విధానాలతో భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా రాష్ట్రంలోని నాలుగు మండలాలను పైలట్ మండలాలుగా ఎంపిక చేసి అమలు చేసింది. అనంతరం అన్ని జిల్లాల్లో ఒక్కో మండలాన్ని రెండో విడత పైలట్ మండలంగా ఎంపిక చేసి ఈనెల 5వ తేదీ నుంచి భూ భారతి అమలు చేయడానికి నిర్ణయించింది. ఇందులో భాగంగా జిల్లాలోని బుగ్గారం మండలాన్ని భూ భారతి పైలెట్ ప్రాజెక్టు మండలంగా ఎంపిక చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా అమలును ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఎన్నో ఏళ్లుగా తాము ఎదుర్కొంటున్న భూ సమస్యలు భూ భారతితోనైనా పరిష్కారం అవుతాయని రైతులు ఆశిస్తున్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించడంతో పాటు క్షేత్ర స్థాయిలో ఉన్నతాధికారులు పర్యటించి భూ సమస్యలకు పరిష్కారం చూపనున్నారు.ఫరెండు బృందాలుగా అధికారులు..బుగ్గారం మండలంలో అధికారులను రెండు బృందాలుగా విభజించి గ్రామ సభలను నిర్వహించడానికి ప్రణాళికను ఖరారు చేశారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు నిర్ణీత రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. మొదటి బృందంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తుండగా బుగ్గారం తహసీల్దార్ మజీద్, నాయబ్ తహసీల్దార్ శ్రీకాంత్, రికార్డు అసిస్టెంట్ స్వామి, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌లు బృందం సభ్యులుగా ఉన్నారు. ఈనెల 5వ తేదీన యశ్వంతరావుపేట, 6న శెకల్లా, 7న గంగాపూర్, 8న గోపులాపూర్, సివంచకోట, 9న బుగ్గారంలో సభలు నిర్వహిస్తారు. రెండో బృందంలో ల్యాండ్ అండ్ సర్వే విభాగం ఏడీ వెంకట్‌రెడ్డి ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తుండగా ధర్మపురి తహసీల్దార్ క్రిష్ణ చైతన్య, గిర్దావర్ బాపురెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేందర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ జనార్దన్‌లు బృందం సభ్యులుగా ఉన్నారు. వీరు ఈనెల 5వ తేదీన మద్దునూరు, 6న సిరికొండ, 7న వెల్గొండ, 8న చిన్నాపూర్‌లలో గ్రామ సభలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించనున్నారు.ఫమండలంలో 19,735 ఎకరాల భూమి బుగ్గారం మండలం పరిధిలో 10 రెవెన్యూ గ్రామాలున్నాయి. వీటి పరిధిలో 19,735.36 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. ఇందులో 360.35 ఎకరాల ఆబాది, నద్దినాలా, రాస్తా భూములున్నాయి. మండలంలో 2,474.25 ఎకరాల అటవీ భూమి, 7,113.20 ఎకరాల ప్రభుత్వ భూమి, 716.38 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. మండలంలో 303.10 ఎకరాలకు చెందిన 358 పెండింగ్ ఖాతాలున్నాయి. 903 సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.ఫసాదా బైనామాలకు మోక్షం రెవెన్యూ రికార్డుల్లో గతంలో పట్టాదారు కాలమ్‌తో పాటు కబ్జాదారు కాలమ్ కూడా ఉండేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిని తీసుకొచ్చినప్పుడు కబ్జా కాలమ్‌ను తొలగించి పట్టాదారు కాలమ్‌ను మాత్రమే రికార్డుల్లో ఉంచింది. దీంతో గతంలో భూములు కొని పట్టాలు చేసుకోని వారు, సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వారు కబ్జాల్లో ఉన్నప్పటికీ వారికి ఆ భూమిపై హక్కులు లేకుండా పోయాయి. గతంలో అమ్ముకున్న వారికే ధరణిలో కొత్తగా పట్టాదారు



పాసుపుస్తకాలు వచ్చాయి. ధరణి అమలులో భాగంగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న భూములన్నింటినీ ఆన్‌లైన్ చేసే సందర్భంలో ఒకరి పేరు మీద ఉన్న భూమి మరొకరి పేరుతో పట్టాలు ఎక్కడం, కొందరికి భూమి తక్కువగా, మరికొందరికి ఎక్కువగా పాస్ బుక్కుల్లో నమోదయ్యాయి. కొందరు తమ భూములను అమ్ముకున్నప్పటికీ వారే దొడ్డిదారిన ఆ భూమిని పాస్‌బుక్కుల్లో ఎక్కించుకోవడం, మరికొందరు కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఒక్కరే పట్టా చేయించుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇలాంటి వాటికి ధరణిలో పరిష్కారం దొరకలేదు. దాంతో కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. భూ భారతీ ద్వారా ఇలాంటి సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించుకునే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం కాకపోతే ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవడం, అక్కడా పరిష్కారం కాకపోతే కలెక్టర్‌కు కూడా అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. ధరణిలో పాస్‌బుక్ పొందిన పట్టాదారుడే తిరిగి వేరే వారికి పట్టా చేస్తేనే పేరు మారేది. అధికారులకు దానిని మార్చే అధికారం లేకపోవడంతో చాలా సమస్యలు పెండింగ్‌లో ఉండేవి. అలాంటి వాటికి భూ భారతిలో మోక్షం లభించనుంది. ధరణిలో స్లాట్ బుక్ చేసుకొని అనివార్య కారణాలతో రిజిస్ట్రేషన్ ఆగిపోతే ఆ డబ్బులు రైతులకు వచ్చేవి కావు. అలాంటివి ఇప్పుడు పరిష్కారయ్యే అవకాశం ఉంది. పట్టా భూమి పొరపాటున ప్రభుత్వ భూమి అని పడితే దాన్ని మార్పు చేయాలంటే సీసీఎల్ఏ వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఇలాంటి సమస్యలు పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండేవి. ఇప్పుడు వాటితో పాటు అత్యధికంగా ఉన్న సాదాబైనామాలకు కూడా మోక్షం లభించే అవకాశం ఉంది.భూ భారతితో రైతులకు ఎంతో మేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ భూ భారతి చట్టం రైతులకు ఒక వరం. ధరణిలో పరిష్కారం కాని సమస్యలు భూ భారతి చట్టంలో పరిష్కారం కానున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అమలు చేస్తోంది. జిల్లాలో పైలట్ మండలంగా ధర్మపురి నియోజకవర్గంలోని బుగ్గారం మండలాన్ని ఎంపిక చేశారు.రైతుల సమస్యలకు పరిష్కారం సత్యప్రసాద్, కలెక్టర్ రైతులకు సంబంధించి ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారం కానున్నాయి. మండలంలోని ప్రతీ రైతు సమస్యను పరిష్కరించి పట్టాలు అందజేస్తాం. ఈనెల 5వ తేదీ నుంచి గ్రామ సభలు ఏర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరిస్తాం. వాటిపై గ్రామంలో విచారణ జరిపి సమస్యలను పరిష్కరిస్తాం.

# ఎర్లీబర్డ్ ఆఫర్‌లో రామగుండం టాప్

**కోల్‌సిటీ, -నవభూమి:** రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్పొరేషన్‌లలో ప్రవేశపెట్టిన ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపు పథకం (ఎర్లీ బర్డ్ ఆఫర్)లో రాష్ట్రంలోనే రామగుండం నగరపాలక సంస్థ రికార్డు స్థాయిలో పన్ను వసూలు చేసి ప్రథమ స్థానంలో నిలిచింది. వార్షిక డిమాండ్‌లో 47.6శాతం పన్ను వసూలు సాధించింది. వార్షిక డిమాండ్ 2025-26లో రూ.18.94కోట్లు ఉండగా ఎర్లీబర్డ్ ఆఫర్‌లో రూ.9కోట్లకు పైగా ఈనెల 3వ తేదీ నాటికే వసూలు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5శాతం రాయితీ ప్రకటించడంతో సింగరేణి, ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్ సంస్థలతోపాటు ప్రైవేట్ సంస్థల నుంచి కూడా పన్ను వసూళ్లకు ఒత్తిడి పెంచారు. కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కోయ శ్రీహర్ష, కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అరుణశ్రీలు 5శాతం రాయితీ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల ప్రభుత్వ నియామకాలతో ఉద్యోగుల సంఖ్య పెరగడంతో ప్రతీ డివిజన్‌కు వార్డు ఆఫీసర్లు, వారికి అసిస్టెంట్లను నియమించారు. శానిటేషన్, రెవెన్యూ విభాగాలు సమన్వయంతో మెదలాలని ఆదేశించారు. ఈ క్రమంలో 5శాతం రాయితీ ప్రకటించడంతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఎన్‌టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్‌తో పాటు సింగరేణి, జెన్‌కోలు కూడా ఆస్తి పన్ను చెల్లిం చాయి. సింగరేణి రూ.1.3కోట్లు, ఆర్‌ఎఫ్‌సీఎల్ రూ.1.2 కోట్లు, ఎన్‌టీపీసీ రూ.4కోట్లు చెల్లించగా బీ థర్మల్ కేం ద్రం మూసివేతకు గురి కావడంతో జెన్‌కో రూ.5లక్షలు పన్నులు చెల్లించింది.



# నిబంధనల ప్రకారం కట్టుదిట్టంగా ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు



**పెద్దపల్లి -నవభూమి:** ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆర్వోఆర్ చట్టం పై సుల్తానాబాద్ మండలం మినహా అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, ధరణి చట్టం, భూ భారతి చట్టం మధ్య వ్యత్యాసాలను స్పష్టంగా రైతులకు వివరించామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పెద్దపెల్లి జిల్లాలో మే ఐదు నుంచి మే 19 వరకు వెలిగేడు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం క్రింద భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, రెవెన్యూ సదస్సులలో వచ్చే దరఖాస్తులను పూర్తిస్థాయిలో జూన్ 2 వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.కోర్టు కేసుల సమస్యలు, కుటుంబ వివాదాల సమస్యలు మినహాయించి మిగిలిన అన్ని రకాల సమస్యలను భూ భారతి చట్టం వినియోగించి పరిష్కరిస్తామని అన్నారు. ప్రతీరోజు రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయో సమగ్ర రికార్డు నిర్వహిస్తున్నామని, ఆర్ఎస్ఆర్, అసైన్మెంట్ సమస్యలు, సాధా బైనామా దరఖాస్తులు, పార్-బీ సమస్యలు, ఇతర వివిధ రకాల భూ సమస్యలను భూ భారతి చట్టం ద్వారా పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద మన జిల్లాలో ఆన్ లైన్, ఆఫ్ లైన్ మొత్తం కలిపి సుమారు 47 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.ప్రభుత్వం కొంత మేర సబ్సిడీ, బ్యాంకు బ్యాంకు లింకేజీ కలిపి యువ వికాసం యూనిట్ గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని, ఎన్‌పీఏ ఉన్న దరఖాస్తుదారులు, సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న దరఖాస్తుదారులను, గత ఐదు సంవత్సరాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి యూనిట్లు పోందిన దరఖాస్తులను ముందుగా మినహాయిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పట్టణ ప్రాంతాలలో అధికంగా దరఖాస్తులు వచ్చాయని, ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో గా దరఖాస్తుల ధ్రువీకరణ పూర్తి చేస్తామని, రాష్ట్రం నుంచి జిల్లాకు యువ వికాసం నిధుల కేటాయింపు జరగగానే మండలాల వారీగా కేటాయింపులు చేసి అర్హుల తుది జాబితా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తయారు చేస్తామని అన్నారు.యాసంగి పంట కొనుగోలు పటిష్టంగా చేపట్టాం గత వాన కాలం ఎటువంటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామని, అదేవిధంగా యాసంగి పంట కొనుగోలుకు పటిష్ట చర్యలు చేపట్టామని అన్నారు. యాసంగి పంట సీజన్ లో పెద్దపెల్లి జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 334 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 13 వేల 573 రైతుల నుంచి 240 కోట్ల విలువ చేసే లక్షా 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 154 కోట్ల ధాన్యం డబ్బులు చెల్లించామని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలు లో ఉన్న సమస్యలను పరిష్కరించామని, ఇప్పటివరకు ఐదువేల మెట్రిక్ టన్నుల సన్న రకం ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు.జిల్లాలో ఎటువంటి డిఫాల్ట్ లేని 105 రైస్ మిల్లులకు ముందుగా ధాన్యం కేటాయింపులు చేశామని , రైస్ మిల్లర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూస్తున్నామని అన్నారు. గత వాన కాలంలో ఒకేరోజు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తే ప్రస్తుతం రెగ్యులర్ గా 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరుగుతుందని, యాసంగి పంటలో ఉత్పత్తి బాగా వచ్చినందున కొనుగోలు కేంద్రాలకు అధికంగా ధాన్యం వస్తుందని, నాణ్యత ప్రమాణాలు ఉన్న చివరి గింజ వరకు ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు ఎటువంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, అవసరమైన హమాలీలను అదనంగా బీహార్ నుంచి రప్పించామని అన్నారు. అకాల వర్షాలు కురిస్తే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.జిల్లాకు 1940 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పెద్దపెల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో 1940 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 700 ఇండ్లు గ్రౌండ్ చేసామని, బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న 150 ఇండ్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ప్రతి సోమవారం ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ప్రకారం నిధులు విడుదల అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. మే 10 వరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున ( పైలెట్ ప్రాజెక్టులో మంజూరు చేసిన మినహాయించి) లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు.

# ఆత్మగౌరవం ఇదేనా?



**కరీంనగర్ -నవభూమి:** బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచి ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వం పదేపదే చెబుతోంది. ఆచరణలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. సాక్షాత్తూ బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సొంత జిల్లాలో వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తమకు ఆత్మగౌరవం ఎక్కడ ఉందంటూ ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరీంనగర్ ఐటీ పార్కు సమీపంలో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసింది. కొన్ని సంవత్సరాలుగా ప్రతి పోటీ పరీక్షలోనూ మెరుగైన ఫలితాలను సాధిస్తూ వస్తున్నది.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బీసీ అభ్యర్థులు వివిధ పరీక్షలకు సిద్ధం కావడానికి బీసీ స్టడీ సర్కిల్‌కు వస్తున్నారు. స్టడీ సర్కిల్‌కు వచ్చేవారికి బయోమెట్రిక్ విధానంలో హాజరు నమోదు చేసుకుని ప్రభుత్వం పక్షాన ఒక బిస్కెట్ ప్యాకెట్, టీ మాత్రమే సమకూర్చేవారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వందకుపైగా కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి చదువుకుంటున్న వారికి మధ్యాహ్నం పూట భోజనం కోసం ఇబ్బందులు పడుతున్నారు. ఉదయంపూట ఇంటి నుంచి తెచ్చుకోలేక జిల్లా కేంద్రంలో ఒక్కో భోజనానికి 150 రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి రావడంతో తక్కువ ధరలో లభించే టిఫిన్, ఇతర ఆహార పదార్థాలతో తిని కడుపునింపుకోవాల్సిన పరిస్థితి ఉండేది. దీంతో గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న గంగుల కమలాకర్ తన సొంత ఖర్చులతో విద్యార్థులకు స్టడీ సర్కిల్‌లో భోజన వసతి ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది.కలెక్టర్ చొరవతో లయన్స్ క్లబ్ భోజనం ప్రస్తుతం 150 మంది విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల కోసం ఇక్కడ సిద్ధమవుతున్నారు. వారికి మధ్యాహ్న భోజన సమస్య పునరావృతం కావడంతో ఇటీవల మాజీ కార్పొరేటర్ జంగిలి అయిలేందర్ యాదవ్ కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి బీసీ స్టడీ సర్కిల్‌లో పరీక్షలకు సిద్ధమవుతున్నవారికి భోజన వసతి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మంత్రి గంగుల కమలాకర్ ఈ సౌకర్యాన్ని కల్పించిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. పరిస్థితిని గమనించిన కలెక్టర్ స్థానికంగా ఉన్న లయన్స్‌క్లబ్ వారిని సంప్రదించి వారి మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఈ విద్యార్థులకు ఉచిత భోజన వసతి కల్పించే ఏర్పాటు చేశారు. బీసీ స్టడీ సర్కిల్‌లోకి జ్యోతిబా పూలే పాఠశాలను షిఫ్ట చేయడంతో ప్రస్తుతం స్టడీ సర్కిల్‌కు విద్యార్థులకు లైబ్రరీ రూం మాత్రమే మిగిలింది. ఈ కేంద్రానికి అధ్యయనం కోసం వచ్చే వారు భోజనం చేయాలంటే ఆరుబయటకు వెళ్లాల్సిందే. మీల్స్ ఆన్ వీల్స్ వాహనం రాగానే విద్యార్థులు దాని వద్దకు వెళ్లి భోజనం పట్టుకుని అక్కడే తిని రావాల్సిన పరిస్థితి ఉన్నది.డైనింగ్ హాల్ లేక ఇబ్బందులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి కోట్లాది రూపాయల బడ్జెట్ కేటాయిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం స్టడీ సర్కిల్‌కు వచ్చే విద్యార్థుల కోసం మధ్యాహ్న భోజన వసతిని ఏర్పాటు చేయలేని స్థితిలో ఉందా అని ప్రశ్నిస్తున్నారు. దాతలు ఉచితంగా సమకూర్చే భోజనంపై ఆధారపడుతున్నామని, ఆత్మగౌరవం గురించి ఆలోచించే పరిస్థితి ఎక్కడ ఉందంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని స్టడీ సెంటర్లకు హాజరయ్యేవారికి టీ, బిస్కెట్‌తోపాటు మధ్యాహ్న భోజన వసతి కూడా కల్పించాలని కోరుతున్నారు. పుస్తకాలు మాత్రమే సమకూర్చడం కాకుండా నెలలో ఒకటి రెండు రోజులు ముఖ్యమైన సబ్జెక్టులపై క్లాసులు కూడా నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కరీంనగర్ స్టడీ సెంటర్‌లో కూర్చుని భోజనం చేసేవిధంగా డైనింగ్‌హాల్‌ను కల్పించాలని, వచ్చే విద్యాసంవత్సరంలోగా ఈ సెంటర్‌లోకి మార్చిన జ్యోతిబాపూలే పాఠశాలను దాని శాశ్వత భవనంలోకి మార్చాలని బీసీ విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్టడీ సెంటర్‌ను సందర్శించి ఇక్కడి పరిస్థితులను పరిశీలించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా స్టడీ సెంటర్లలో మధ్యాహ్న భోజన వసతి ఏర్పాటు కోసం ముఖ్యమంత్రితో చర్చించి తగిన ఉత్తర్వులు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

# ప్రశాంతంగా నీట్

**కరీంనగర్, -నవభూమి:** కరీంనగర్ జిల్లాలో ఆదివారం నిర్వహించిన నీట్‌ప్రశాంతంగా ముగిసింది. కలెక్టర్ పమేలా సత్పతి ఆధ్వర్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఏడు కేంద్రాలను ఏర్పాటు చేయగా 2975 మంది విద్యార్థులకు 2914 మంది పరీక్ష రాశారు. 61 మంది విద్యార్థులు పరీక్ష రాయలేదు. కరీంనగర్ బైపాస్‌రోడ్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్, ఎస్సారార్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్ష ప్రశాంతంగా జరిగేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఆమె వెంట నెహ్రూ యువ కేంద్ర కో-ఆర్డినేటర్ రాంబాబు, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, తహసీల్దార్ రాజేష్ ఉన్నారు.వివిధ నీట్ పరీక్షా కేంద్రాలను అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.మూడు నిమిషాల ఆలస్యంతో..నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రంలో మూడు నిమిషాలు ఆలస్యంగా రావడంతో వేములవాడకు చెందిన కుమ్మరి వైష్ణవి పరీక్షను కోల్పోయింది. వైష్ణవితోపాటు ఆమె తల్లి పరీక్షకు అనుమతించాలని అధికారులను కోరుతూ విలపించారు. సంవత్సరం వృథా అవుతుందని, పుస్తెలతాడు అమ్మి లక్షా 60 వేలతో లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇప్పించామని, పరీక్షకు హాజరయ్యేందుకు రాగా కేవలం మూడు నిమిషాల ఆలస్యంతో అధికారులు అనుమతించలేదని విద్యార్థిని తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మరో విద్యార్థి కూడా ఆలస్యంగా పరీక్షా కేంద్రానికి రాగా అధికారులు కేంద్రంలోకి అనుమతించలేదు.



## కేంద్ర కులగణన సర్వే చరిత్రాత్మకం



**కరీంనగర్, -నవభూమి:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేస్తున్న కులగణన సర్వే చరిత్రాత్మకమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రారంభోత్సవం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర కులగణన నిర్ణయం కాంగ్రెస్ విజయమని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ కులగణన సర్వేకు మోదీ కులగణనకు పొంతనే లేదన్నారు. కాంగ్రెస్ కులగణనతో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. బీసీల జనాభాను తగ్గించి చూపారన్నారు. కాంగ్రెస్ మాయ మాటలను జనం నమ్మడం లేదన్నారు. 52 శాతం జనాభా ఉన్న బీసీలను 46 శాతంగా చూపారన్నారు. 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేస్తున్నామని చెప్పి అందులో పది శాతం రిజర్వేషన్లను ముస్లింలకు కేటాయించారన్నారు. నిజానికి కాంగ్రెస్ బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తానంటుందన్నారు. ఇప్పటికే మోదీ ప్రభుత్వం 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలులో వైఫల్యాన్ని పక్కదోవ పట్టించేందుకు కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. నిషేధిత మావోయిస్టు సంస్థతో చర్చల ప్రసక్తే లేదని, వాళ్లు తుపాకీ వీడాల్సిందే, పోలీసులకు లొంగిపోవాల్సిందేనని స్పష్టం చేశారు. మావోయిస్టుల సమస్యను సామాజిక కోణంతో చూడాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కగార్ ఆపాలంటూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్రంగా స్పందించారు. మందుపాతరలు పెట్టి పోలీసులు, రాజకీయ నాయకులను చంపుతుంటే సామాజిక కోణంలో చూడాలా అని ప్రశ్నించారు. మావోయిస్టులపై నిషేధం విధించిందే కాంగ్రెస్ పాలకులు అన్నారు. రాష్ట్రంలో మావోయిస్టులపై విధించిన నిషేధాన్ని ఎత్తివేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. మావోయిస్టులు తుపాకులు చేతిలో పట్టుకుని అమాయకులైన గిరిజనులు, పోలీసులను కాల్చి చంపుతున్నారన్నారు. మహాముత్తారంలో ఎస్ఐ భార్య సీమంతం చేసుకునే సమయంలో బాంబులు పెట్టి నక్సల్స్ ఆ ఎస్ఐని, కానిస్టేబుల్‌ను చంపేశారన్నారు. దూరదర్శన్ జర్నలిస్టును చంపేశారు. బీజేపీ నాయకులు సామ జగన్మోహన్‌రెడ్డి, మధుసూదన్‌గౌడ్, రామన్న, గోపన్నలను చంపేశారన్నారు. కాంగ్రెస్ నాయకుడు అజాత శత్రువు శ్రీపాదరావును చంపేశారన్నారు. కేసీఆర్ టీడీపీలో ఉండగా ఎంతో మంది నాయకులను చంపేశారన్నారు. పాకిస్తాన్ పౌరులను తిరిగే పంపే అంశంపై కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు ఆదేశాలిచ్చిందని, దేశమంతా సీరియస్‌గా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం నామమాత్రంగా చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. ఇప్పటికీ చాలా మంది పాస్‌పోర్టు వీసాల్లేకుండా ఇక్కడ నివసిస్తున్నట్లు సమాచారముందన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చి వారం రోజులైందని, చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ సునీల్‌రావు, కొత్తపల్లి మాజీ ఛైర్మన్ రుద్ర రాజు, మాజీ ఎంపీపీ వాసాల రమేష్, స్వర్గం నర్సయ్య, చంద్రశేఖర్, కెంచ శేఖర్ పాల్గొన్నారు.

## ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి

**చిగురుమామిడి, -నవభూమి:** అకాల వర్షం, ఎదురుగాలులకు నేలరాలిన మామిడి తోటల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముదిమాణిక్యం, గాగిరెడ్డిపల్లి, గురుకుల పల్లె తదితర గ్రామాల్లో నేలరాలిన మామిడి తోటలను, వరి ధాన్యాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య తో కలిసి సోమవారం పరిశీలించారు.రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో మామిడికాయలు నేలరాలాయని, పెద్ద ఎత్తున నష్టం సంభవించిందని రైతులు వారు ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో కురిసిన గాలి, వర్ష బీభత్సానికి వర్షానికి స్తంభాలు విరిగాయని, ఇల్లు పరిక్షంగా దెబ్బతిన్నాయని అన్నారు. ముదిమాణిక్యంలో జక్కుల రవి, జక్కుల మహేష్ లకు చెందిన పది ఎకరాల మామిడి తోట కాయలు పూర్తిగా నేల రాలాయని అన్నారు.



### రేపటి నుంచి ఆర్ఎఫ్‌సీఎల్‌లో

# ఉత్పత్తి నిలిపివేత




**కోల్‌సిటీ, -నవభూమి:** రాష్ట్ర రైతాంగానికి అండగా ఉన్న ఆర్ఎఫ్‌సీఎల్ ఈ నెల 6వ తేది నుంచి ఉత్పత్తి నిలిపివేస్తోంది. వార్షిక మరమ్మతుల కార ణంగా ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తున్నారు. ఏప్రిల్‌లో షట్‌డౌన్ చేయాల్సి ఉండగా ఉత్పత్తి అవసరాల దృష్ట్యా మే వరకు పొడిగించారు. ప్లాంట్‌లో కీలకమైన హీట్ ట్రాన్స్‌ఫర్ రిఫార్మర్ (హెచ్‌టీఆర్)లో మరమ్మతు, అమ్మోనియా పైప్‌లైన్లు, ఇతర యంత్రాల మరమ్మ తులు చేయనున్నారు. హెచ్‌టీఆర్‌కు సంబంధించి గోద్రేజ్ సంస్థ మెయింటెనెన్స్ పనులు నిర్వహించ నుంది. సుమారు 30 నుంచి 40రోజుల పాటు ఈ మరమ్మతులు జరుగనున్నాయి. జూన్ 6 నుంచి 15వ తేదీలోగా ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి దశలోకి వచ్చే అవకాశం ఉంది. 25రోజుల్లో షట్‌డౌన్ పూర్తి చేస్తామని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నా సాంకేతికంగా అది సాధ్యమయ్యే పరిస్థితులు లేనట్టుగా తెలుస్తోంది. వర్షాకాల సీజన్ ప్రారంభ సమయానికి కానీ ప్లాంట్‌లో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది.వర్షాకాలం ముందు టెన్షన్...రాష్ట్రంలో ఈ ఏడాది వరి, మొక్క జొన్న విస్తీర్ణం పెరగడంతో యాసంగిలో ఎరువుల వాడకం భారీగా పెరిగింది. దీంతో ఆర్ఎఫ్‌సీఎల్‌పై యూరియా సర ఫరాకు ఒత్తిడి పెరిగింది. గతేడాది ఆర్ఎఫ్‌సీఎల్‌లో 11.94లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగితే రాష్ట్రానికే 4.68లక్షల టన్నులు సరఫరా చేసింది. మిగతా యూరియాను ఏపీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సరఫరా చేశారు. సాధారణంగా తెలంగాణ ప్రభుత్వం వర్షాకాల సీజన్‌కు ముందే ఏప్రిల్ నుంచి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గోడౌన్‌లలో యూరియా నిల్వలను భద్రపరుస్తుంది. బఫర్ స్టాక్‌గా ఈ నిల్వలు రైతుల అవసరాన్ని బట్టి మళ్లీ సరఫరా చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర యూరియా అవసరాల్లో ఆర్ఎఫ్‌సీఎల్‌నే ఎక్కువగా యూరియా సరఫరా చేస్తుంది. సంస్థ ఉత్పత్తిలో 45శాతం తెలం గాణకే సరఫరా చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిం చిన కోటా ప్రకారం ఆర్ఎఫ్‌సీఎల్‌తో పాటు గుజరాత్ స్టేట్ ఫర్టిలైజర్స్, ఇఫ్కో, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్, కోరమండల్, క్రిభ్కో సంస్థలు యూరియా సరఫరా చేస్తాయి. ఇందులో గుజరాత్ స్టేట్ ఫర్టిలైజర్స్, ఇఫ్కో, రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్‌కు సొంత యూనిట్లు ఉండగా కోరమండల్, క్రిభ్కోలు యూరి యాను దిగుమతి చేసుకుని రాష్ట్రాలకు సరఫరా చేస్తాయి.ఆర్ఎఫ్‌సీఎల్‌తో రాష్ట్రంపై తగ్గిన ఒత్తిడి..రాష్ట్రంలో నీటి లభ్యతను బట్టి సాగు విస్తీర్ణంలో హెచ్చుతగ్గులుంటాయి. దానిపై ఆధారపడి యూరియా వినియోగం ఉంటుంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం సీజన్‌కు ముందు యూరియా దిగుమతి చేసుకుని బఫర్ స్టాక్‌గా నిల్వ ఉంచుకునేది. రామగుండంలో ఆర్ఎఫ్‌సీఎల్ నెలకొల్పిన తరువాత అత్యవసర సమ యాల్లో రాష్ట్రాన్ని ఆదుకుంటుంది. ఈ ఏడాది యాసం గిలో సాగు విస్తీర్ణం పెరగడంతో రాష్ట్రంలో అదనంగా 2.59లక్షల టన్నులు యూరియాను అదనంగా కొను గోలు చేశారు. డిపార్ట్‌మెంటల్ ఆఫ్ ఫర్టిలైజర్స్ సరైన సమయంలో యూరియాను అందివ్వలేదనే విమర్శలు కూడా వచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఆర్ఎఫ్‌సీఎల్ రాష్ట్రా న్ని ఆదుకున్నది. యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో సరఫరా చేసింది.షట్‌డౌన్‌తో టెన్షన్...ఆర్ఎఫ్‌సీఎల్‌లో షట్‌డౌన్‌తో ఉత్పత్తి నిలిపి వేయ డంతో వ్యవసాయశాఖలో కొంత టెన్షన్ మొదలైంది. ఆర్ఎఫ్‌సీఎల్ ప్రతీ నెల 1.35లక్షల టన్నుల ఉత్పత్తి చేస్తుంది. అందులో నుంచి 45శాతం తెలంగాణ అవస రాలకు యూరియాను ఇస్తారు. సాధారణంగా ఏప్రిల్‌లో షట్‌డౌన్ చేసుకున్నా మే మాసంలో ఉత్పత్తి జరుగుతుంది కనుక వర్షాకాల సీజన్‌కు యూరియా అందుతుంది. ఈసారి మేలో షట్‌డౌన్ చేశారు. వ్యవ సాయశాఖ వద్ద యూరియా నిల్వలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. సీజన్‌కు ముందు బఫర్ స్టాక్ పెట్టుకోవాల్సి ఉంది. ఆర్ఎఫ్‌సీఎల్ షట్‌డౌన్ కావడంతో ఇతర పరిశ్రమలు, విదేశాల నుంచి దిగుమతి అయ్యే యూరియాపై ఆశలు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. మే నెల ప్రారంభం నుంచి 10వేల టన్నులు రాష్ట్రానికి సరఫరా చేశారు. రాష్ట్ర అవసరాలను బట్టి 20వేల నుంచి 35వేల టన్నులు ఆర్ఎఫ్‌సీఎల్‌కు టార్గెట్ పెట్టారు. జూన్‌లో ఉత్పత్తి ప్రారంభమైతే రాష్ట్రానికి యూరియాను యుద్ధ ప్రాతిపదికన సరఫరా చేయాల్సి ఉంటుంది. ఏమైన అవాంతరాలతో జాప్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిళ్లు తప్పవు.

### పేదల సంక్షేమమే

# కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**కాల్వశ్రీరాంపూర్,-నవభూమి:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం పెగడపల్లి గ్రామంలో కాంగ్రెస్ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావే శంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యకర్తలు ప్రజలకు అండదండగా ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు గుర్తించి నాయకుడిగా ఎన్నుకుంటా రన్నారు. గ్రామ గ్రామానికి ప్రభుత్వం ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేసిందన్నారు. పొండ వుల గుట్టపై గతంలో 270డబుల్ బెడ్‌రూంలు కట్టిన ఇండ్లకు మిగులు పనులు చేయించి కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లి గ్రామాలకు చెం దిన నిరుపేదలకు కేటాయిస్తామన్నారు. ప్రభు త్వం నిర్ణయించిన ఇంటి నమూనా ప్రకారమే ఇల్లు కడితేనే ఇందిరమ్మ బిల్లు ఐదు లక్షలు దశలవారీగా వస్తుందన్నారు. ప్రతిపక్ష పార్టీకి చెందిన ఎవరైన నిరాధారమైన తప్పుడు ఆరోప ణలు చేస్తే కేసులు తప్పవన్నారు. ప్రభుత్వం సన్నవడ్లు కూడా కొనడం ప్రారంభించిందని కాంటాలు కూడా ప్రారంభమయ్యాయన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ ఏ సమస్య వచ్చినా అలుపెరుగక పనిచేస్తున్నానన్నారు. గ్రామాల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు సీఎం రేవంత్‌రెడ్డి అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య పాల్గొన్నారు.



## ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్-5లో ట్యాంకర్ బోల్తా.. కాంట్రాక్ట్ సూపర్వైజర్ మృతి



**గోదావరిఖని -నవభూమి:** సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ 1 పరిధిలోని జీడికే 5 ఓపెన్ కాస్ట్ గనిలో సోమవారం సాయంత్రం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో కాంట్రాక్ట్ సూపర్వైజర్ వికాస్ కుమార్ (35) మృతి చెందాడు. ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో ప్రైవేట్ ఓబి పనులు నిర్వహిస్తున్న పీసీ పటేల్ కంపెనీలో పార్కింగ్ సూపర్వైజర్ గా పని చేస్తున్న బీహార్ రాష్ట్రానికి చెందిన వికాస్ కుమార్ సోమవారం సాయంత్రం హాలేజే రోడ్లో ప్రైవేట్ ట్యాంకర్ నడుపుతూ అదుపుతప్పి కిందకు దూకాడు. ఈ క్రమంలో ట్యాంకర్ వెనకవైపు టైరు అతని పైనుండి వెళ్లడంతో వికాస్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదం కు గల కారణాలను ప్రైవేటు ఓబి కంపెనీ వెల్లడించడం లేదు.

## జగ్గయ్యపల్లిలో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



**కాల్వ శ్రీరాంపూర్ -నవభూమి:** మండలంలోని మల్యాల గ్రామ పరిధిలోని జగ్గయ్యపల్లెకు చెందిన ఉప్పుల శారద (23) సోమవారం ఉలేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పుల శారత గత కొన్ని సంవత్సరాల నుండి మానసికంగా బాధపడుతోంది. భర్త అజయ్ కుమార్ శారదను పలు ఆసుపత్రులు తీసుకెళ్లినా ఆమె జబ్బు నయం కాలేదు. దీంతో మానసికంగా బాదపడుతుంది. ఇంట్లో ఎవరు లేని సమయంలో సోమవారం తెల్లవారు జామున ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి మామిడి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపాడు. మృతురాలికి కుమారుడు హిమాన్స్ ఉన్నాడు.

## మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి.. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

**జ్యోతినగర్, -నవభూమి:** మావోయిస్టులు గతంలో సాధించింది కానీ, భవిష్యత్లో సాధించేది కానీ ఏముండదని, జనజీవన స్రవంతిలో కలువాలని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ఎన్టీపీసీ టౌన్షిప్లోని వీఐపీ గెస్ట్ హౌస్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలు ఏవరు తూపాకి గొట్టం ద్వారా రాజ్యాధికారం రావాలని కోరుకోరన్నారు. ప్రభుత్వంతో చర్చలకు కోరుకుంటున్న నక్సలైట్లు తమ తూపాకులను పక్కన పెట్టి లోంగిపోవాలన్నారు. ఎంతో మంది రాజకీయ నాయకులను కాల్చి చంపారన్నారు. వరవరరావు, హరిగోపాల్ ఎంతో మంది మావోయిస్టుల శవాలను మోసి ఏమి సాధించారన్నారు. భారత దేశంలో జాతీయ జెండాను ఎగురవేసిన వారే దేశభక్తులని,నల్ల జెండాలను ఎగురవేసిన వారు దేశ ద్రోహులని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైందని, గతంలో కాంగ్రెస్ పార్టే మావోయిస్టు పార్టీపై నిషేధం విధించిందని, ఇప్పుడు వారి మెప్పు పొందేందుకే సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చినన ఆరు గ్యారంటీల అమల్లో విఫలమైందన్నారు. ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ కుల గణన సర్వే నామమాత్రంతో బీసీలకు అన్యాయం చేసిందన్నారు. కేంద్రం ప్రభుత్వం చెపట్టే సర్వేతో బీసీలకు సముచిత న్యాయం జరుగనుందన్నారు.



## రైతన్నల సంక్షేమమే

# ప్రజా ప్రభుత్వం లక్ష్యం



**కోనరావుపేట,-నవభూమి:** రైతన్నల సం క్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేము లవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా నీటిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆదివారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎన్నో ఏళు ్లగా ఎదురుచూస్తున్న కుడి కాలువకు నీటిని విడుదల చేయడం జరిగిందని వెల్ల డించారు. మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ ద్వారా వేములవాడ నియోజకవర్గంలోని 12గ్రామాలకు సాగు నీరు అందనుందని విప్ వెల్లడించారు. ప్యాకేజీ 9లో భాగంగా మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ ద్వారా కోనరావుపేట మండలం మల్కపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, మంగళపల్లి గ్రామాలకు, అలాగే వేములవాడ మండలం మారుపాక వరకు నీటిని విడుదల చేశా మని తెలిపారు. మల్కపేట కుడి కాలువకు 250 క్యూసెక్కులు విడుదల చేశామని, దాదాపు 8 వేల ఎకరాలకు సాగు, తాగునీరు అందుతుందని విప్ వివరించారు. దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాణహిత చేవెళ్ల, అంబేద్కర్ సుజల స్రవంతి పేరిట మన ప్రాం తానికి సాగునీరు తీసుకురావడానికి నర్మాలలో ఎగువ మానేరు వరకు సాగునీరు తీసుకపోయే క్రమంలో ఎల్ఎండీ కరీంనగర్, మిడ్ మానేరు నిర్మాణం చేసుకొని వరద కాలువను తవ్వుకొని, ఎస్సారెస్పీ ద్వారా మిడ్ మానేరు నింపుకొని అక్కడి నుంచి పంపు చేసుకుని మల్కపేట, ఎగువ మానేరుకు నింపుకోవడానికి 2008లో రాజశేఖర్రెడ్డి శంకుస్థాపన చేశారన్నారు. 2003లో ఉమ్మడి కరీంన గర్ జిల్లాలో పాదయాత్ర భాగంగా నర్మాలలో నిద్ర చేసిన సంద ర్భంగా వేములవాడ, సిరిసిల్ల ప్రాంతం నుంచి వేలాదిమంది వెళ్లా రని గుర్తుచేశారు. 2009లో సుదర్శన్రెడ్డి ఇరిగేషన్ మినిస్టర్గా ఉన్నప్పుడు శంకుస్థాపన చేశారని వివరించారు. ఆరోజు ఈ ప్రాజె క్టుకు ప్రాణహిత చేవెళ్ల, అంబేద్కర్ సుజల స్రవంతి అనే పేరు ఉండేదని, తదుపరి పేరు మార్చి కాళేశ్వరం ప్యాకేజీ 9గా పేరు మార్చారని అన్నారు. పదేళ్లుగా పడావుపడ్డ కాలువ పనులను పూర్తిచేసి అందులో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించామ ని తెలిపారు. రైతులకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మంత్రు లతో మాట్లాడి ఎల్లారెడ్డిపేట వరకు రైతాంగానికి నీటిని విడుదల చేశామని వివరించారు. ఆరోజు మెయిన్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి అక్కపల్లి, బుగ్గరాజేశ్వర తండా, అల్మాస్పూర్, రాజ న్నపేట, దేవునిగుడి తండా, గొల్లపల్లి, బాక్రుంపల్లి, తిమ్మాపూర్ వరకు నీటిని విడుదల చేశామని చెప్పారు. సుమారు 5000 ఎకరా లకు సాగు నీరు విడుదల చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎక్కడ ఇబ్బంది ఉన్నా దాన్ని తీర్చే బాధ్యత తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. రైట్ మెన్ కెనాల్ ద్వారా సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట మండలాల్లోని గ్రామాలకు 25,694 ఎకరాల ఆయక ట్టుకు నీరు అందిస్తామన్నారు. భూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందజేసి కాలువ పనులు ప్రారంభం చేసి నీటిని విడుదల చేశా మని తెలిపారు. ఎడమ కాలువ కోసం ఇప్పటి వరకు 70 ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని, మరో 70 ఎకరాలు భూసేకరణ చేస్తామని పేర్కొన్నారు.

## పేకాట రాయుళ్లపై ఇల్లెందు పోలీసుల ఉక్కుపాదం

### కట్టుగూడెం పాత పెంకుల ఫ్యాక్టరీలో దాడి - ఎనిమిది మంది అరెస్ట్

**ఇల్లెందు టౌన్ మే 5 నవభూమి ప్రతినిధి:** పేకాట రాయుళ్లపై ఇల్లెందు పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఇల్లెందు మండలం కట్టుగూడెం గ్రామంలోని బండారు వెంకన్న కు చెందిన పాత పెంకుల ఫ్యాక్టరీ లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని ఆదివారం రాత్రి 11-30 గంటల సమయంలో సిఐ బత్తుల సత్యనారాయణ ఆద్వర్యంలో పోలీసుల బృందం దాడి చేసి పట్టుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐ బత్తుల సత్యనారాయణ మీడియాకు వెల్లడించారు. ఏ1 నిందితుడైన ముకుందాపురం గ్రామానికి చెందిన బండారు వెంకన్న, ఇల్లెందు జగదాంబ సెంటర్ కు చెందిన ఆర్ ఎం పి డాక్టర్ గడ్డం రాజశేఖర్, కేసముద్రం కు చెందిన ప్రైవేటు స్కూల్ టీచర్ పిల్లి అశ్వక్, మహబూబాబాద్ కు చెందిన పూల వ్యాపారి మల్లారపు రమేష్, మహబూబాబాద్ ఈదుల పూసపల్లి గ్రామానికి చెందిన రైతు గన్నం చంద్రశేఖర్ రెడ్డి, గంధంపల్లి గ్రామానికి రైతు నిమ్మగడ్డ నాగేంద్ర బాబు, మహబూబాబాద్ కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బాణోత్ నాగన్న నాయక్, నర్సంపేట రాజుపల్లి గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ గుల్లా ప్రకాష్ తదితరులు కలిసి పేకాట ఆడుతుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వీరి వద్ద నుండి రూ.46,310 ల నగదు, ఎనిమిది సెల్ ఫోన్లు, ఒక కారు, ఒక మోటార్ సైకిల్ ను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వీరందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



## పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులను కాపాడుకోగలుగుతాం

**గోదావరిఖని, -నవభూమి:** సమరశీల పోరాటాల ద్వారానే కార్మిక హక్కులను కాపాడుకోగలుతామని గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఐఎఫ్టీయూ)రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ అన్నారు. ఆదివారం ఐఎఫ్టీయూ కార్యాలయంలో రామకృష్ణ అధ్యక్షతన రామగుం డం రీజియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ సింగరేణి గని కార్మికుల హక్కుల కోసం నిజాయితీగా పోరాటాలు నిర్వ హించిన చరిత్ర జీఎల్బీకేఎస్కు ఉందని, అనేక ఆటుపోట్లను, ప్రభుత్వ నిర్బంధాన్ని, సింగరేణి యాజమాన్య నిరంకుశ విధానాలను ఎదుర్కొన్న దని, సంఘం నాయకులు రాములు, కుమారస్వామిలతో పాటు ఎంతో మంది కార్మిక నాయకులు అమరులయ్యారు. ఈనెల 20న జరిగే సమ్మెను సింగరేణిలో విజయవంతం చేయాలన్నారు. కేంద్రంలో మోదీ, అమిత్ షా లు కార్మిక చట్టాలను మార్చి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకొచ్చి కార్పొ రేట్ శక్తులకు కార్మికులను బానిసలుగా చేసే కుట్రలకు ఒడిగట్టిందన్నారు. రామగుండం రీజియన్, డివిజన్ల కార్యవర్గాలను ఎన్నుకున్నారు. రామగుండం రీజియన్ కమిటీ అధ్యక్షుడిగా బీ అశోక్, ఉపాధ్యక్షుడిగా తొట్ల రాయమల్లు, కార్యదర్శిగా ఈదునూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా చింతల శేఖర్, కోశాధికారిగా గుండేటి మల్లేశం, కార్యవర్గ సభ్యులుగా ఎస్ ప్రసాద్, ఎన్సీ బాబు, పీ మొండయ్య, బీ కిరణ్, ఏ చంద్రయ్య, దాసరి నర్సయ్య, కే తిరుపతి, ఎం నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఆర్జీ-1 డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎన్సీ బాబు, కార్యదర్శిగా చింతల శేఖర్, సహాయ కార్యదర్శిగా పీ మొండ య్య, కోశాధికారిగా బీ కిరణ్, కార్యవర్గ సభ్యులుగా ఇర్ఫాన్, శ్రీకాంత్, శ్రీనివాస్, రాజకుమార్, తిరుపతిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్జీ-1, 3 డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా తొట్ల రాయమల్లు, ఎన్నుకొన్నారు.